క్లుప్తంగా

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమన్వయకర్త కె.కె.రాజు

సీతమ్మధార: జీవీఎంసీ 14వ వార్డు బాలయ్య శాస్త్రి లేఅవుట్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో శనివారం నెడ్‌క్యాప్ చైర్మన్, పార్టీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గంలోని పలు వార్డులకు చెందిన ప్రజలు ఆయనకు తమ సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వాటిని స్వీకరించి పరిశీలించిన కె.కె.రాజు వెంటనే కొన్నింటిని పరిష్కరించారు. మిగిలిన వినతులను సంబంధిత అధికారులకు రిఫర్ చేసి త్వరలోనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

బాక్సింగ్ క్లబ్ ప్రారంభం



బాక్సింగ్ క్లబ్, బౌట్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు గణేష్‌నగర్‌లో హైవేకు ఆనుకొని ఉన్న గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో హనుమాన్ బాక్సింగ్ క్లబ్‌ను ఏర్పాటు చేశారు. శనివారం జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ మెంబర్, కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పిల్లలకు బాక్సింగ్ గ్లౌజులు తొడిగి క్లబ్‌ను ప్రారంభించారు. కార్యక్రమంలో బాక్సింగ్ కోచ్‌లు కనకరాజు, దినేష్, హరీష్, లక్ష్మణ్, స్థానిక నాయకులు సారిపిల్లి గంగరాజు, సారిపిల్లి సంతోష్, నమ్మి వెంకట్, బొమ్మాళి రవి, జగన్, విజయ్, సురేష్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం



నిహారిక

మర్రిపాలెం: కంచరపాలెం పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన శనివారం చోటు చేసుకుంది. ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఊర్వశి జంక్షన్ వద్ద తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న యువతి కోనాడ నిహారిక శుక్రవారం అర్ధరాత్రి దాటాక కనిపించలేదు. వేసవి సెలవుల నేపథ్యంలో తండ్రి నరసింహమూర్తి తన కుమార్తెను జ్ఞానాపురంలో ఉంటున్న బంధువు ల ఇంటికి పంపించారు. శుక్రవారం బంధువుల ఇంటి నుంచి బయటకు వెళ్లిన నిహారిక అర్ధరాత్రి 12 గంటలు అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో శనివారం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో తండ్రి ఫిర్యాదు చేశాడు. హెడ్ కానిస్టేబుల్ బి.ఎస్.మూర్తి కేసు దర్యాప్తు చేపట్టారు.

ఎస్టీ సెల్ ప్రక్షాళన హర్షణీయం

మహారాణిపేట : కేజీహెచ్‌లో ఎస్టీ సెల్‌ను ప్రక్షాళన చేయడం పట్ల ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారామ్ ఒక ప్రకటనలో సంతోషం వ్యక్తం చేశారు. ఈ విషయమై సాక్షి దిన పత్రికలో ఈనెల 12న 'కేజీహెచ్ ఎస్‌టీ సెల్ ప్రక్షాళన' శీర్షికన వార్త ప్రచురితమైన సంగతి విదితమే. అవినీతి, నిర్లక్ష్యం వంటి ఆరోపణలు వెల్లువెత్తిన ఈ విభాగం గిరిజనులకు సరైన సేవలందించలేకపోయిందని అన్నారు. ఈ తరుణంలో ఇక్కడి సిబ్బందిని బదిలీ చేసి కొత్త వారిని నియమించడం మంచి పరిణామమన్నారు. బాలల హక్కుల కమిషన్ ఆదేశాలు అమలు చేసిన ఏఎస్ఆర్ జిల్లా కలెక్టర్ సుమిత్, విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున, ఐటీడీఏ పీవో, వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జమాల్ బాషా, కేజీహెచ్ సూపరింటెండెంట్ అశోక్‌కుమార్‌కు కమిషన్ తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని సీతారాం తెలిపారు.

అదిరింది..!



సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నిర్మించిన సిమెంట్ బెంచీలు



ఆర్ఐ, వీఆర్వోల గది

- కార్పొరేట్ స్థాయిలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం
- మారిన కార్యాలయ రూపురేఖలు
- ప్రత్యేక సదుపాయాల కల్పన
- ప్రజలకు ఇబ్బందులు లేకుండా చర్యలు

సీతమ్మధార: కార్పొరేట్ స్థాయికి ఏమాత్రం తగ్గకుండా సీతమ్మధార అర్బన్ తహసీల్దార్ కార్యాలయాన్ని ఆధునికీకరించారు. అదిరింది అనిపించేలా కార్యాలయ రూపురేఖలు మారాయి. నిత్యం వివిధ పనుల నిమిత్తం వచ్చే అర్జీదారుల కోసం ప్రత్యేక వసతులు కల్పించారు. పచ్చదనంతో నిండి ఆహ్లాదకరంగా ఉండేలా కార్యాలయ ఆవరణాన్ని తీర్చిదిద్దారు.

1982లో ప్రారంభం..

1982 మార్చి 9న నాటి కమిషనర్ ఆఫ్ ల్యాండ్ రెవెన్యూ అధికారి వి.సుందరసన్(ఐఏఎస్) సీతమ్మధారలో తాలూకా ఆఫీస్ బిల్డింగ్‌ను ప్రారంభించారు. 1993లో మండల రెవెన్యూ ఆఫీస్‌గా రెన్యూవేట్ చేసి పోర్టు ట్రస్ట్ చైర్మన్ టి.గోపాలరావు(ఐఏఎస్), అప్పటి జిల్లా కలెక్టర్ కె.ప్రదీప్‌చంద్ర(ఐఏఎస్)తో కలిసి కార్యాలయ ప్రారంభోత్సవం చేశారు.

నాడు అలా.. నేడు ఇలా

అర్బన్ తహసీల్దార్ కార్యాలయం గతంలో పలు సమస్యలతో కొట్టుమిట్టాడేది. ఉద్యోగులకు కావాల్సిన మౌలిక సదుపాయాలు, జనం కోసం వసతుల ఏర్పాటును పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. గతేడాది జూలైలో సీతమ్మధార మండల అర్బన్ తహసీల్దార్‌గా పేర్ల శ్యామ్‌ప్రసాద్ బాధ్యతలు స్వీకరించిన తరువాత కార్పొరేట్ కార్యాలయంగా మారింది. డీఆర్వో శ్రీనివాసమూర్తి స్ఫూర్తితో అర్బన్ తహసీల్దార్ కార్యాలయ రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. కార్యాలయ ఆవరణలో దరఖాస్తుదారుల కోసం సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేశారు. పలు రకాల మొక్కలు నాటారు. ఆర్ఐ, వీఆర్వోల కోసం ప్రత్యేక గది, రికార్డ్ రూమ్‌లు, మహిళల కోసం ప్రత్యేక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. డిప్యూటీ తహసీల్దార్‌తోపాటు కింద స్థాయి ఉద్యోగుల కోసం ప్రత్యేక హాల్ రూపొందించారు. కార్యాలయానికి వచ్చే అర్జీదారుల కోసం ప్రత్యేక హెల్ప్ డెస్క్, కుర్చీలు, తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశారు. వాహనాల పార్కింగ్‌తోపాటు మౌలిక సదుపాయాలు కల్పించారు. జై భేరి సంస్థ మహిళలకు మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. సిబ్బందితోపాటు అందరి సహాయ, సహకారాలతో తహసీల్దార్ కార్యాలయాన్ని కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు.



ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లో సేవలు



అర్జీదారుల కోసం ప్రత్యేక కుర్చీలు

అన్ని సదుపాయాలు కల్పించాం

గతంలో అర్బన్ తహసీల్దార్ కార్యాలయం అడవిలా ఉండేది. కలెక్టర్ ఆదేశాల మేరకు రూపురేఖలు మార్చి ప్రజలు, ఉద్యోగుల కోసం అన్ని సదుపాయాలు కల్పించాం. దాతలు, సిబ్బంది సహాయ సహకారాలతో తహసీల్దార్ కార్యాలయాన్ని ఆధునికీకరించాం.

– పి.శ్యామ్‌ప్రసాద్, అర్బన్ తహసీల్దార్

అక్రమ నిర్మాణాల కూల్చివేత

సీతమ్మధార: జీవీఎంసీ జోన్–3 పరిధి 24వ వార్డు నక్కవానిపాలెం ప్రధాన రహదారిలోని 60 ఫీట్ రోడ్డులో చేపడుతున్న అక్రమ నిర్మాణాన్ని శనివారం కూల్చివేశారు. జీవీఎంసీ టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు టీపీఎస్ తేజ ఆధ్వర్యంలో సిబ్బంది చర్యలు చేపట్టారు. చైతన్య నగర్, కేఆర్ఎం కాలనీ, ఇసుకతోట, సింహాద్రిపురం ప్రాంతాలతోపాటు నక్కవానిపాలెంలోని అక్రమ నిర్మాణాలు తొలగించారు.



60 ఫీట్ రోడ్డులో అక్రమ కట్టడాన్ని తొలగిస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

నవయుగ వైతాళికుడు కందుకూరి

సీతంపేట: నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం అని పలువురు వక్తలు కొనియాడారు. కందుకూరి వీరేశలింగం జయంతి సందర్భంగా శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో సాహిత్య గోష్ఠి నిర్వహించారు. పలువురు రచయితలు, సాహితీవేత్తలు పాల్గొని లఘు ప్రసంగాలు చేశారు. సభాధ్యక్షుడు డి.వి.సూర్యారావు మాట్లాడుతూ వీరేశలింగం తెలుగు దేశానికి విద్యుచ్ఛక్తి వంటి వాడని ప్రశంసించారు. ఆచార్య కోలవెన్ను మలయవాసిని మాట్లాడుతూ స్త్రీ జన జాగృతికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. వీరేశలింగం రచించిన పలు రచనల గురించి వివరించారు. ఆచార్య వెలమల సిమ్మన్న కందుకూరిపై రచించిన గ్రంథాన్ని డాక్టర్ ఎం.సుబ్బారావు సమీక్షించారు. గ్రంథాలయ కార్యదర్శి డి.ఎస్.వర్మ, సాహితీవేత్తలు శేఖరమంత్రి ప్రభాకర్, కందాల కనకమహాలక్ష్మి, మస్తాన్‌రెడ్డి, సి.నిర్మల, ఘండికోట విశ్వనాథం, ఇ.సుధాకరరావు, ఇ.కళావతి, పి.లలితావాశిష్ట తదితరులు వీరేశలింగం చేసిన సంఘ సేవలను, రచనలను ప్రస్తావించారు. కొందరు కవులు కందుకూరిపై కవితలు చదివి వినిపించారు.



సాహిత్య గోష్ఠిలో పాల్గొన్న కవులు, రచయితలు

హృదయాలను హత్తుకున్న నాటకాలు

మద్దిలపాలెం: మూడో ప్రపంచ యుద్ధ భయంతో క్షణక్షణం నరకయాతన పడుతూ బతుకీడుస్తున్న కాలంలో సరిహద్దు జీవన గాథే కథాంశంగా ప్రదర్శించిన కొత్త పరిమళం నాటకం, తల్లిదండ్రుల పేగు బంధంపై ప్రదర్శించిన మనసున మనసై నాటకం ప్రేక్షకుల హృదయాలను హత్తుకున్నాయి. విశాఖ మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో పైడా కౌశిక్ రాష్ట్ర స్థాయి నాటక పోటీల్లో ఐదో రోజు ప్రదర్శించిన రెండు నాటకాలు ప్రేక్షకుల మన్ననలు పొందాయి. మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో శనివారం ఈ పోటీలను కస్టమ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీకాంత్, వీఎండీఏ అధ్యక్ష, కార్యదర్శులు ఎమ్మెస్ఎన్ రాజు, డాక్టర్ గుమ్ములూరి రాంబాబు, ట్రస్టీ పైడా కృష్ణప్రసాద్‌ల ప్రారంభించారు.

తొలి ప్రదర్శన: 'కొత్త పరిమళం'

శ్రీకాకుళం జిల్లా బొరివంకకు చెందిన శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం వారు కొత్త పరిమళం నాటకాన్ని అద్భుతంగా ప్రదర్శించారు. మూడో ప్రపంచ యుద్ధ భయంతో రగిలిన విద్వేశాలను కళ్లకు కట్టినట్టుగా చూపారు. మనుషుల్లో మానవత్వం మంటగలిసిపోయి జాతి, మతం విద్వేషాలతో దేశాలు రగిలిపోతున్న క్షణాలు.. కన్నీళ్లు పెట్టేలా నటీనటుల ప్రతిభకు పట్టం కట్టారు. జాతి, మతద్వేషాలను అంతం చేసే మానవత్వ విశ్వరూప సౌందర్యం అనే కొత్త పరిమళంతో హద్దులు, సరిహద్దులు లేని ప్రపంచాన్ని భావితరాలకు అందించాలనే ఇతివృత్తంతో ప్రదర్శించిన ఈ నాటకానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. కరతాళ ధ్వనులతో నటీనటులకు కృతజ్ఞతలు తెలిపారు. కె.కె.స్వామి నాటకాన్ని రచించగా.. బి.ఎం.ఎస్ పట్నాయక్ దర్శకత్వం వహించారు.



కొత్త పరిమళం నాటకంలోని ఓ సన్నివేశం

రెండో ప్రదర్శన: 'మనసున మనసై'

ఏలూరుకు చెందిన హేళాపూరి కల్చరల్ అసోసియేషన్ వారిచే మనసున మనసై నాటకం ప్రదర్శించారు. చిన్నతనంలో బడికి వెళ్లిన బిడ్డ తిరిగి ఇంటికొచ్చే వరకూ ఎదురుచూసే తల్లిదండ్రులు, పెరిగి పెద్దవాడయ్యాక సుదూర ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తూ తలకొరివి పెట్టడానికి రోజుల తరబడి మార్చురీ బాక్స్‌లో పెట్టి ఎదురుచూసే పరిస్థితుల ఇతివృత్తంగా ప్రదర్శించిన ఈ నాటకం ప్రేక్షకుల మనసును కదిలించింది. చింతల మల్లేశ్వరరావు, పి.కృష్ణ హితేష్‌లు నాటకాన్ని రచించగా.. ఎం.డి.ఖాజావల్లి దర్శకత్వం వహించారు. రెండు గొప్ప నాటకాలను తిలకించామంటూ ప్రేక్షకులు ప్రశంసించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించినట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి(క్లరికల్) సిహెచ్.సుబ్బిరెడ్డి తెలిపారు. ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, ముత్తూట్ ఫిన్ కార్పో లిమిటెడ్, స్మార్ట్ సర్వీసెస్, కెలిబర్ సపోర్ట్ సర్వీసెస్, మహవీర్ గ్రూప్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 263 ఉద్యోగాలకు గాను 46 మంది అర్హత పొందారని చెప్పారు. ఎంపికైన అభ్యర్థులకు అర్హత పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంప్లాయిమెంట్ అధికారి సుబ్బిరెడ్డి

పోలమాంబ ఆలయంలో మహా అన్నదానం

ఏయూక్యాంపస్: కరకచెట్టు పోలమాంబ అమ్మవారి ఆలయంలో శనివారం మహా అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. అమ్మవారి వార్షిక జాతర అనంతరం ఏర్పాటు చేసిన మహా అన్నదానంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.

30న 'మే డే' సాంస్కృతిక ఉత్సవాలు

డాబాగార్డెన్స్: ప్రపంచ కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 30న అల్లూరి విజ్ఞాన కేంద్రంలో మే డే సాంస్కృతిక ఉత్సవాలు నిర్వహించనున్నట్టు కేంద్రం ప్రతినిధి జీఎస్ రాజేశ్వరరావు, సాంస్కృతిక విభాగం ప్రతినిధి దండు నాగేశ్వరరావు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు.

పాటలు, పద్యాలు, శ్రామిక అభ్యుదయ గీతాలకు శాస్త్రీయ నృత్యాలు, కోలాటం, తప్పెటగుళ్లు, ఏక పాత్రాభినయాలు, ఫ్లూట్ తదితర వాయిద్య కళారూపాలు, మిమిక్రీ, హాస్యం, షార్ట్ ఫిలిమ్స్ తదితర కళారూపాల్లో ప్రావీణ్యం ఉన్న వారంతా పాల్గొనవచ్చని తెలిపారు. ఈ నెల 25 లోగా తమ ఎంట్రీలను 94907 50661, 9490 098794 నంబర్లకు వాట్సాప్ ద్వారా పంపించాలని చెప్పారు.

వైభవుడికి సుప్రభాత సేవ



ఆలయ ప్రదక్షిణ చేస్తున్న అర్చకులు, భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిగింది. మధ్యాహ్నం గోవింద, వరలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో 200 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వెంకన్నకు విశేష పూజలు



పూజలందుకున్న వేంకటేశ్వర స్వామి

కంచరపాలెం: తిక్కవానిపాలెం కలియుగ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం విశేష పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శంకర్‌శర్మ, జగనాథశర్మ ఆధ్వర్యంలో సుప్రభాత సేవ, అర్చనలు, పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం పద్మావతి, అలమేలు మంగమ్మ సమేత వెంకన్నకు ప్రాతఃకాల తిరువారాధన, అష్టోత్తరాలు, తులసీదళ బిల్వార్చన జరిపారు. గ్రామాధ్యక్షుడు ఉమ్మిడి వాసుదేవరావు నేతృత్వంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండాలి

కంచరపాలెం: దివ్యాంగులు అన్ని రంగాల్లో ముందుండాలని ప్రొఫెసర్ బి.అప్పారావు అన్నారు. జ్ఞానాపురం ఎర్నిమాంబ ఆలయ ప్రాంగణంలో శనివారం దివ్యాంగుల సేవా సంఘం ఆధ్వర్యంలో వారికి నిత్యావసర సరకుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బ్యాంకుల ద్వారా సబ్సిడీ రుణాలు అందజేస్తే స్వయం ఉపాధి ద్వారా అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం పేద దివ్యాంగులకు నిత్యావసర సరకులు అందజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఎం.సురేష్, ఒమ్మి కృష్ణ, ఒమ్మి రామరాజు, తిరుపతి గణపతి, గురుమూర్తి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

51వ వార్డులో 'ప్రచార భేరి'



నిరసన తెలుపుతున్న సీపీఐ,సీపీఎం నాయకులు

మర్రిపాలెం: కేంద్రంలో బీజేపీ, రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 30 వరకు సీపీఐ, సీపీఎం నిర్వహించే ప్రచార భేరీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు పిలుపునిచ్చారు. 51వ వార్డు మాధవధార అంబేడ్కర్ కాలనీలో శనివారం ఇంటింటికీ కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ఉండే సమస్యల పరిష్కారం కోసం వామపక్షాలు పాదయాత్రలు చేస్తున్నాయన్నారు. సీపీఐ ఉత్తర నియోజకవర్గ కార్యదర్శి పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఈ నెల 26న గాజువాకలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

జగనన్న పాలనలో ఇంటింటా సంక్షేమం



శాంతినగర్‌లో వృద్ధురాలికి సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న కె.కె.రాజు



45వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న నేపాల్ శ్రీను, పైడి రమణ

కంచరపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రతి ఇంటికీ సంక్షేమ ఫలాలు అందుతున్నాయని నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు అన్నారు. 46వ వార్డులో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కైలాసపురం, శాంతినగర్ ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ పాలనలో జరుగుతున్న మంచి గురించి అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాల లబ్ధిని వివరించి కరపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సంక్షేమ పథకాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు విశ్వసిస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో మళ్లీ ఆయనే సీఎం కావాలని గడప గడపలో ప్రజలు కోరుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో జేసీఎస్ కో–ఆర్డినేటర్ హర్షవర్ధనరెడ్డి, కో–ఆప్షన్ సభ్యుడు అప్పారావు, స్థానిక నాయకులు గోవింద్, దూది నరిసింగరావు, సోమునాయుడు, సచివాలయ సిబ్బంది, కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

జోరుగా 'జగనన్నే మా భవిష్యత్తు'

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు 134 సచివాలయం కన్వీనర్ వానపల్లి లక్ష్మణ్‌బాబు, 130 సచివాలయం కన్వీనర్ నంబూరి పద్మ ఆధ్వర్యంలో శనివారం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం జోరుగా నిర్వహించారు. కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు వివరించి కరపత్రాలు పంచారు. ప్రజా మద్దతు సర్వేలో ప్రశ్నలకు సమాధానాలు సేకరించారు. మద్దతు తెలిపిన వారి ఇంటికి, మొబైల్ ఫోన్‌కు స్టిక్కర్లు అతికించారు. కార్యక్రమంలో గృహసారథులు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

45, 55 వార్డుల్లో..

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డులోని 253 సచివాలయం పరిధి కొండవాలు ప్రాంతాల్లో సచివాలయ కన్వీనర్లు రాజుయాదవ్, ఎల్.రవిశంకర్, వి.అల్లాజీరావు గృహసారథులతో కలిసి ప్రతీ ఇంటికి వెళ్లి సీఎం వైఎస్ జగన్ పాలనపై సర్వే నిర్వహించారు. 256 సచివాలయం పరిధి వైఎస్సార్ నగర్‌లో కన్వీనర్ గుంటుపల్లి(నేపాల్) శ్రీను ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, గృహసారథులు రామిరెడ్డి, రమ, వలంటీర్ రమణమ్మ, కార్యకర్తలు నాయుడు, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

- 55వ వార్డులోని 250 సచివాలయం పరిధి తాటిచెట్లపాలెంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు, సచివాలయ కన్వీనర్ దుప్పలపూడి శ్రీనివాస్, 45వ వార్డు అధ్యక్షుడు పైడి రమణతో కలిసి జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. గృహసారథులు పైల దివాకర్, సూర్యకుమారి, వలంటీర్లు లక్ష్మణ్, హేమలత, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు ఎం.డి.గౌస్‌లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ, ఇంటింటికి జగనన్న స్టిక్కర్ అతికించారు. సీఎం పాలనపై స్థానికుల అభిప్రాయాలు సేకరించారు.



55వ వార్డులో కరపత్రాలు అందిస్తున్న దుప్పలపూడి శ్రీనివాస్, గృహసారథులు

వాకర్స్ పార్కు అభివృద్ధికి కృషి

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ పార్కు సుందరీకరణకు ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి కోరారు. ఆయన అధ్యక్షతన శనివారం వాకర్స్ పార్కులో క్లబ్ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్కులో కొత్తగా మొక్కలు నాటుతున్నామని చెప్పారు. బ్యూటిఫికేషన్‌కు మొక్కలు నాటడంతోపాటు వాటి సంరక్షణ బాధ్యతను తీసుకుంటామన్నారు. రానున్న కాలంలో ఆర్వో ప్లాంటు ఏర్పాటు చేయాల్సి ఉందని, ఇందుకు దాతల సహకారం తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అడిషనల్ సెక్రటరీ జనరల్ ఆర్.సత్యానాథం, కార్యదర్శి ద్వారకానాథ్, వాకర్స్ క్లబ్ పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, కార్యదర్శి లంకా వెంకటసుధాకర్, సీహెచ్ కృష్ణమూర్తి, కేజీ కృష్ణారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి

ప్రజలకు మరింత చేరువగా న్యాయ సేవలు

విశాఖ లీగల్: ప్రజలకు న్యాయ సేవలను చేరువ చేయడంలో అన్ని ప్రభుత్వ శాఖలు భాగస్వామ్యం కావాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ జడ్జి కేకేవీ బులికృష్ణ అన్నారు. జిల్లా కోర్టు ప్రాంగణంలోని న్యాయ సేవా సదన్‌లో శనివారం ప్రభుత్వ శాఖల ప్రతినిధులతో ఆయన చర్చించారు. న్యాయ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి తీసుకోవాల్సిన చర్యలపై పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్లు జె.మాధవి, జ్ఞానవేణి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బులికృష్ణ

పబ్లిక్ డిమాండ్

నిరుపయోగంగా టాయిలెట్లు

కంచరపాలెం: స్థానిక రామ్మూర్తిపంతులుపేట వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగుల కోసం వినియోగించాల్సిన టాయిలెట్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి.

ఇక్కడి వైద్య సిబ్బంది వీటికి ఎప్పుడు తాళాలు వేసి ఉండటంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారు. తాళాలు తీయమని అడుగుతున్నా.. వైద్య సిబ్బంది స్పందించడం లేదు. దీంతో పబ్లిక్ ప్రదేశాల్లో రోగులు మూత్ర విసర్జన చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి టాయిలెట్లు వినియోగంలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలి.

– పి.యజ్ఞకుమార్, రెడ్డి కంచరపాలెం



ఆర్పీ పేట ఆరోగ్య కేంద్రంలో తాళాలు వేసి ఉన్న టాయిలెట్ రూమ్

ఫోర్ట్‌టౌన్ పీఎస్‌లో పాడైన కుర్చీలు

సీతమ్మధార: స్థానిక ఫోర్ట్‌టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఇనుప కుర్చీలు పాడయ్యాయి. ఎప్పటి నుంచో మరమ్మతులకు నోచుకోకుండా ఉండిపోయాయి. ప్రతి రోజు స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు కూర్చొనే సౌకర్యం లేక ఇబ్బంది పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి వెంటనే కుర్చీలను బాగుచేయాలని వారు కోరుతున్నారు.



పోలీస్ స్టేషన్ ఆవరణలో మరమ్మతులకు నోచుకోని ఇనుప కుర్చీలు